ప్రమాదాలకు నిలయంగా కల్వర్టు

- హైవేపై గల మేజర్ కాల్వ కల్వర్టు పక్కన అబ్బిరెడ్డిగూడెంకు దారి
- వాహనాలు ప్రధాన రహదారిపైకి వచ్చే క్రమంలో ప్రమాదాలు
- నూతన కల్వర్టును విశాలంగా నిర్మించాలని ప్రజల వేడుకోలు


ప్రమాదకరంగా అబ్బిరెడ్డిగూడెం మేజర్ కాలువపై ఉన్న కల్వర్టు

గరిడేపల్లి : మండల కేంద్రం సమీపంలో హుజూర్‌నగర్– మిర్యాలగూడ ప్రధాన రహదారిపై అబ్బిరెడ్డిగూడెం వెళ్లే రోడ్డు పక్కన ఉన్న కల్వర్టు ప్రమాదాలకు నిలయంగా ఉంది. అబ్బిరెడ్డిగూడెం మేజర్ కాల్వపై ఉన్న ఈ కల్వర్టు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే హైవేను విస్తరించినా ఇక్కడ నూతన కల్వర్టు నిర్మించలేదు. కల్వర్టు రోడ్డుకు ఆనుకొని ఉండడంతో హైవేపై అతివేగంగా వెళ్లే వాహనాలు అబ్బిరెడ్డిగూడెం నుంచి హైవేపైకి వచ్చే వాహనాలను గమనించక ఢీకొడుతున్నాయి. దీంతో ప్రమాదాలకు గురై ఎంతో మంది ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి.

ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు..

కల్వర్టు పక్కన రోడ్డు ఇరుకుగా ఉండడం, అబ్బిరెడ్డిగూడెం నుంచి వచ్చే వాహనాలు హైవేపైకి వచ్చే వరకు కనిపించకపోవడంతో వాహనాల వేగంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కాగా, కల్వర్టు జరిగిన ప్రమాదంలో గరిడేపల్లికి చెందిన ఇద్దరు, వెంకట్రాంపురం గ్రామానికి చెందిన ఒకరు, ఇతర గ్రామాలకు చెందిన పలువురు తమ ప్రాణాలు కోల్పోయారు. ఈ కల్వర్టు విషయాన్ని ప్రయాణికులు, ప్రజలు గతంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఆయన పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. కాగా, కల్వర్టు వెంట ఉన్న అబ్బిరెడ్డిగూడెంకు వెళ్లే దారిలో లక్ష్మీపురం, సర్వారం, లింగగిరి హుజూర్‌నగర్ పట్టణానికి అనేకమంది ప్రయాణికులు ద్విచక్ర వాహనదారులు, ట్రాక్టర్లలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టి సారించి హైవే నుంచి అబ్బిరెడ్డిగూడెం రోడ్డుకు విశాలంగా నూతన కల్వర్టు నిర్మించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు కూడా ప్రమాదాలు జరగకుండా రోడ్డుపై ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన కల్వర్టు నిర్మించాలి



అబ్బిరెడ్డిగూడెం వెళ్లే రోడ్డు వెంట ఉన్న కల్వర్టు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. హైవేపై అతివేగంగా వచ్చే వాహనాలు అబ్బిరెడ్డిగూడెంకు వెళ్లే ప్రయాణికులకు ఢీకొనడంతో ఇప్పటికే అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. కావున అక్కడ నూతన కల్వర్టు నిర్మించి ప్రమాదాలు జరగకుండా నివారించాలి. ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు వెంట ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలి.
– ఎస్‌కే యాకూబ్, సీపీఎం మండల కార్యదర్శి

‘స్వచ్ఛతా హీ సేవ’పై అవగాహన ర్యాలీ


హుజూర్‌నగర్ : ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

హుజూర్‌నగర్ : స్వచ్ఛతా హీ సేవ –2024లో భాగంగా హుజూర్‌నగర్‌లో సోమవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ పార్క్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం గాంధీ పార్క్‌లో శ్రమదానం చేశారు. తొలుత ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పారిశుద్ధ్యం, స్వచ్ఛతపై అవగాహన కల్పించి వారిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ యాకుబ్ పాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, సీనియర్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు, విద్యార్థులు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ‘స్వచ్ఛతా హీ సేవ’

మోతె : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నిర్వహించిన పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య సిబ్బంది వీధుల్లో దోమల నివారణకు పౌడర్ చల్లారు. మురుగు కాల్వలు శుభ్రం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఏపీఎం వెంకయ్య, సీసీలు, పంచాయితీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఆశా కార్యకర్తలు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సూర్యాపేటటౌన్ : యువత సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్ ఎస్ఐ నీలిమ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు షీ టీమ్, సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్ మత్తుమందులపై పోలీసు కళాబృందంతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చదువుకునే విద్యార్థులు, యువతీ యువకులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంక్ ఖాతా, ఇతర వివరాలు గుర్తు తెలియని వారికి తెలియజేయొద్దని సూచించారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు పిర్యాదు చేయాలని అన్నారు. హెడ్ కానిస్టేబుల్ యల్లారెడ్డి, మౌనిక, శృతి, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, గురులింగం, క్రిష్ణ, చారి, నాగార్జున, విద్యార్థినులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలు తొలగించాలని వినతి


కలెక్టరేట్‌లో వినతిప్రతం అందజేస్తున్న నారాయణపురం గ్రామస్తులు

చిలుకూరు : మండలంలోని నారాయణపురం ఊర చెరువు ఆక్రమణలు తొలగించి, చెరువు సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కోరుతూ పలువురు గ్రామస్తులు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్‌లో జరిగిన గ్రీవెన్స్ డేలో వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు తెగిన చెరువు కట్ట, గండ్లను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని, చెరువు కట్ట తెగి వరదలతో పంట దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బాధిత రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

నేడు, రేపు నియోజకవర్గ స్థాయి క్రీడలు


ఏర్పాట్లు చేస్తున్న పీఈటీలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని కరక్కాయలగూడెంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళ, బుధవారాల్లో నిర్వహించబోయే నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను మండల స్థాయిలో ఎంపికైన పాఠశాలల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి భూక్యా సైదానాయక్ తెలిపారు. సోమవారం పాఠశాలలో క్రీడా ప్రాంగణాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. వాలీబాల్, ఖో–ఖో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు మైసయ్య, ప్రదీప్, శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల బహూకరణ


కుర్చీలు అందజేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని రేపాలలో గల అంగన్‌వాడీ కేంద్రానికి అదే గ్రామానికి చెందిన గెల్లి దయాకర్‌రావు పన్నెండు కుర్చీలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతకు టీచర్ డి.శ్రీలత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు తుమ్మ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహా సభలను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న అనంతప్రకాష్

పాలకవీడు : మండలంలో ఈ నెల 27 నుంచి అక్టోబర్ 10 వరకు నిర్వహించబోయే సీపీఎం గ్రామ శాఖ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి కె.అనంతప్రకాష్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభల్లో గత మూడేళ్లుగా ప్రజా సమస్యలపై చేపట్టిన పోరాటాలను సమీక్షించనున్నట్లు, భవిష్యత్ ప్రణాళికలను రచించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ముషం నరసింహ, పగడాల మట్టేష్, దిద్దకుంట్ల పురుషోత్తంరెడ్డి, మాతంగి ఏసురత్నం, నన్నెపంగ రమేష్, యరడ్ల మల్లారెడ్డి, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓట్లు తొలగించాలని వినతి

మేళ్లచెరువు : మండలంలోని రామాపురంలో స్థానికేతరుల ఓట్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని గ్రామానికి చెందిన కొందరు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. గ్రామ పరిధిలోని బీమా సిమెంట్ పరిశ్రమలో గతంలో పనిచేసి పదేళ్లుగా ఇక్కడ నివాసం ఉండని 150 మంది ఓట్లు ఉన్నాయని, వారిని ఓ వర్గం వారు ప్రలోభ పెడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ సైదానాయక్

హుజూర్‌నగర్ : ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలని ఎంఈఓ సైదానాయక్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాలీ ఫోనిక్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇంగ్లిష్‌ను సులభంగా, సరళమైన పద్ధతిలో బోధించడానికి జాలీ ఫోనిక్స్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ బోధన పద్ధతులు, పదాల ఉచ్ఛారణ, ప్లే– వే పద్ధతిలో విద్యార్థులకు ఎలా బోధించాలో ఇంగ్లిష్ భాషా నిపుణుల చేత శిక్షణ ఇప్పిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మఠంపల్లి ఎంఈఓ చత్రునాయక్, స్టేట్ రిసోర్స్ పర్సన్ అంజలి, హెచ్‌ఎం జయవాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహా రుద్రాభిషేకానికి జిల్లా కలెక్టర్‌కు ఆహ్వానం


కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎస్ఎస్‌పీ క్యాంపులో అక్టోబర్ 27న నిర్వహించబోయే మహా రుద్రాభిషేకం కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌ను నిర్వహణ కమిటీ సభ్యులు సోమవారం ఆహ్వానించారు. అదే విధంగా జిల్లా కేంద్రంలో ఏఎస్పీ మేకా నాగేశ్వరరావు, డీఈఓ అశోక్‌కుమార్, వివిధ శాఖల అధికారులను వారు కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గజ్జి ప్రభాకర్, గుండా శ్రీనివాసరావు, కన్నెగొల్ల అశోక్, ఎడ్ల విజయ్, కీతా సుధాకర్ పాల్గొన్నారు.

సాయిభార్గవ్‌కు యూత్ సభ్యుల చేయూత


సాయిభార్గవ్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న యూత్ సభ్యులు

మునగాల : తల్లిదండ్రులను, తోబుట్టువును పోగొట్టుకుని ఒంటరైన మునగాల మండలం గణపవరం గ్రామానికి చెందిన అనాథ బాలుడు పగిళ్ల సాయిభార్గవ్‌కు దాతలు చేయూతనందిస్తున్నారు. బాలుడి పరిస్థితిపై సాక్షి దినపత్రికలో ×కుటుంబాన్ని కోల్పోయి ఒంటరైన బాలుడు× అనే శీర్షికతో ప్రచురితమైన కథనాన్ని చూసి స్పందించి ఆర్థికసాయం అందజేస్తున్నారు. సోమవారం గ్రామానికి చెందిన శ్రీకృష్ణయూత్ సభ్యులు రూ.23 వేలు, అంబేద్కర్ యూత్ సభ్యులు రూ.3 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందిన సాయిభార్గవ్ సోదరి మహేశ్వరి చిత్రపటానికి యూత్ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్, శ్రీకృష్ణయూత్ అసోసియేషన్ సభ్యుడు, యూత్ కాంగ్రెస్ మండల నాయకుడు పచ్చిపాల నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.

ధ్యానంతో సత్ప్రవర్తన


ధ్యాన శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శివరామ్‌ప్రసాద్

మునగాల : ధ్యానంతో వ్యక్తికి సత్ప్రవర్తన లభిస్తుందని హార్ట్ ఫుల్ నెస్ ధ్యాన శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ శివరామ్‌ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో శ్రీరామచంద్రవిషన్ ఆధ్వర్యంలో హార్ట్ ఫుల్ నెస్ ధ్యాన శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అభ్యాసుల చేత సహజ మార్గ పద్ధతిలో ధ్యానం చేయడం నేర్చుకోవడంతో మనిషి ప్రవర్తనలో మార్పు వస్తుందన్నారు. కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ సీహెచ్.వరప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్ పి.ఏడుకొండలు, రామారావు, నాగార్జునరెడ్డి, శ్రీలక్ష్మి, ధనలక్ష్మి, మహేంద్ర, పిడమర్తి సైదులు, అభ్యాసకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం


మున్సిపల్ సిబ్బందిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : మండలంలోని చిల్లేపల్లిలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉత్తమ ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డిని సోమవారం నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమావత్ దిప్లానాయక్, బట్టు మధు, వెంకట్‌రెడ్డి, పీఆర్‌టీయూ మండల మాజీ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మాతంగి సైదులు, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కొండయ్య, వీరారెడ్డి, నాగార్జునరెడ్డి, షఫీ తదితరులు ఉన్నారు.


వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

మున్సిపల్ సిబ్బందికి..

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో ఉత్తమ సేవలు అందించి ఇటీవల అవార్డులు అందుకున్న పారిశుద్ధ్య కార్మికుడు ఎస్‌కే జానీ, కంప్యూటర్ సేవలు అందించిన కాసాని శ్రీకాంత్‌లను స్వచ్ఛతా హీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా సోమవారం నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్ పర్సన్ అలక సరిత, కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు, చల్లా ప్రభాకర్‌రెడ్డి, జిలకర రామస్వామి, గుండ్రెడ్డి సైదిరెడ్డి, శ్రీనివాస్‌రావు, రంగారెడ్డి, విశ్వనాథం, వెంకట్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, నవీన్, సతీష్‌రెడ్డి, నాగార్జున తదితరులు ఉన్నారు.

ఘనంగా వనభోజన మహోత్సవం


చెన్నకేశ్వాపురంలో వనభోజనాలకు వెళ్తున్న గ్రామస్తులు

నడిగూడెం : మండలంలోని చెన్నకేశ్వాపురం గ్రామంలో వనభోజన మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతల ఆలయాల వద్ద ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ సమీపంలోని వనంలోకి వెళ్లి భోజనాలు ఆరగించి, రోజంతా ఆటపాటలతో గడిపారు.

ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం సఫాయి మిత్ర సురక్ష కార్యక్రమంలో భాగంగా నేరేడుచర్ల మున్సిపాలిటీలో ప్రజా మరుగు దొడ్ల వద్ద నిర్వహించిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు దరిచేరవని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

సర్వేజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ అందజేత


నోట్ బుక్స్ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం దొండపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సర్వేజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.6వేల విలువ గల ఎగ్జామ్ నోట్ బుక్స్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్వేజన ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు బండారు కవిత అమరేందర్‌రెడ్డిని హెచ్‌ఎం సత్తిరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, రషీదుద్దీన్, మస్తాన్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, క్రాంతికుమార్, అశోక్‌రెడ్డి, జానీబేగం తదితరులు పాల్గొన్నారు.

జెర్రిపోతులగూడెంలో సామూహిక సీమంతం


సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్లు

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉపేంద్ర మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు సైదులు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు విలాసకవి నిర్మల, లక్ష్మి, అరుణ, సుశీల, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


కోదాడరూరల్ : డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు


హుజూర్‌నగర్ : బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

కోదాడరూరల్ : కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ముత్యాలు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కోదాడలోని బస్టాండ్ ఎదుట సీఐటీయూ ఆర్టీసీ కార్మికుల సంఘం నాయకులు (సీఐటీయూ అనుబంధ సంఘం) నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను హరించే విధంగా బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. కార్మికులు అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న పీఎఫ్, ఈఎస్ఐ, వారంతపు సెలవులు, కనీస వేతన హక్కు వంటి వాటిని వేతన కోడ్, వర్కింగ్ కండిషన్స్ కోడ్, పారిశ్రామిక సంబంధాలు, సామాజిక భద్రతల కోడ్‌లుగా విభజించి కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్.సోమన్న, ఏఎస్‌రావు, శ్రీకాంత్, నరసయ్య, ఇమామ్‌పాషా, సైదులు, రాజు, వినయ్, కరిముల్లా ఉన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం నూతనంగా లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురువయ్య అన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సోమవారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందని అన్నారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చింతకాయల రాము, నాయకులు పాశం రామరాజు, ఇంటి అచ్చమ్మ, సలిగంటి జానయ్య, చప్పిడి సావిత్రి, కందుల వెంకన్న, గద్దం వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

డబ్బా కొట్లు తొలగించొద్దని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

కోదాడ : కోదాడ కోర్టు ముందు రోడ్డు పక్కన తాము ఏర్పాటు చేసుకున్న డబ్బా కొట్లను తొలగించాలని నోటీసులు ఇచ్చారని, దీని వల్ల తాము ఉపాధి కోల్పోయి రోడ్డున పడతామని డబ్బా కొట్లను తొలగించకుండా చూడాలని కోరుతూ పలువురు వ్యాపారులు సోమవారం కోదాడ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికిప్పుడే డబ్బా కొట్లను తొలగించరని తెలిపారు. ఒకవేళ తొలగించినా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో దుకాణాలు నిర్మించి ఇస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు బషీర్ తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి


ప్రైవేటు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నర్సింహారావు, తదితరులు

మోతె : ప్రైవేటు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని టీపీటీఎల్ఎఫ్ జిల్లా కన్వీనర్ జె.నర్సింహారావు అన్నారు. సోమవారం మోతె మండలంలోని మామిళ్లగూడెంలో గల శ్రీవెంకటేశ్వర విద్యాలయంలో తెలంగాణ ప్రైవేటు టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రైవేటు ఉపాధ్యాయులకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎండీ జానిమియా, మీరాంబీ, సఫియా, ఉపాధ్యాయులు ఎస్. నర్సయ్య, సైదులు, పుల్లయ్య, మల్లేష్, రమేష్, లక్ష్మయ్య, సునిత, సరిత, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి


సీతారాం ఏచూరి, సీతారామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గరిడేపల్లి : ఇటీవల కురిసిన వర్షాలకు గండ్లు పడి, ఇసుక మేటలు వేసిన పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్‌కే యాకూబ్ కోరారు. సోమవారం మండలంలోని వెలిదండ గ్రామంలో నిర్వహించిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, మేదరమెట్ల సీతారామయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం సీపీఎం గ్రామ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా యానాల భిక్షమయ్య, సహాయ కార్యదర్శి రాంబాబు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోయిన్ల నవీన్, మండల కమిటీ సభ్యులు యానాల సోమయ్య, యానాల సుశీల, మాజీ ఎంపీటీసీ కమల కిరణ్, నోసిని గోపి, రవి, ప్రసాద్, రాంబాబు, కోటయ్య, గోపి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

కోదాడ : ప్రభుత్వ పాఠశాలలకు స్వచ్ఛంద సంస్థలు చేయూత నివ్వాలని కోదాడ ఎంఈఓ సలీం షరీఫ్ కోరారు. సోమవారం కోదాడ బాలుర పాఠశాలలో కోదాడ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్), యూత్ ఫర్ సేవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సాధు ఫణికుమార్, నకిరికంటి సుధాకర్‌రావు, సుందరి శ్రీనివాస్, సుశర్మ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలివెళ్లిన భవన నిర్మాణ కార్మికులు

నడిగూడెం : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన జరిగే ధర్నాకు సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం పిలుపు మేరకు సోమవారం నడిగూడెం నుంచి పలువురు నాయకులు చలో తరలివెళ్లారు. తరలి వెళ్లినవారిలో ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు వల్లెపు శ్రీనివాస్, సీఐటీయూ మండల కన్వీనర్ వెంకన్న, నాయకులు తిరుమలేష్, ఉపేందర్ తదితరులు వెళ్లారు.